ఎస్వీయూలో అంతర్గత బదిలీలలు..!

- వివాదాస్పదంగా ఒకే సామాజికవర్గానికి పెద్దపీట వేస్తూ ఉత్తర్వులు!
- ఏకకాలంలో 128 మందిని బదిలీ చేయడంపై ఆగ్రహం
- మండి పడుతున్న కూటమిలోని మరో పార్టీ అనుకూల ఉద్యోగులు



తిరుపతి సిటీ: రాజకీయ కుట్రలు, సామాజికవర్గ పోరుకు నిలయమైన ఎస్వీయూలో అధికారులు ఆగమేఘాల మీద ఏకకాలంలో సుమారు 128మంది బోధనేతర సిబ్బందికి స్థానచలం కల్పిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో ఎన్ఎంఆర్, టైంస్కేల్, శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. యూనివర్సిటీ స్థాపించిన నాటి నుంచి ఇంత పెద్ద ఎత్తున ఒకేసారి అంతర్గత బదిలీలు జరిగిన ఘటన ఎస్వీయూ చరిత్రలోనే లేదని ఉద్యోగులు విస్తుపోతున్నారు. రాజకీయ కుట్రతో పాటు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారిని ప్రధాన శాఖలలో నియమించారని ఉద్యోగులు మండిపడుతున్నారు. కూటమిలోని మరో సామాజిక వర్గానికి అనుకూలురైన ఉద్యోగులను ఎలాంటి ప్రాధాన్యతలేని స్థానాలకు పంపించడంతో వివాదం రాజుకుంది.

ప్రభుత్వ నిబంధనలకు పాతర

ప్రభుత్వ నిబంధనలకు ప్రకారం ఒకే స్థానంలో ఐదేళ్ల పాటు పనిచేసిన ఉద్యోగులను బదిలీ చేసేందుకు అవకాశం ఉంది. కానీ నిబంధనలను తుంగలో తొక్కి ఐదేళ్లు పూర్తి కాని ఉద్యోగులను సైతం సామాజిక వర్గం, రాజకీయ కుట్రలతో బదిలీ చేశారు. ప్రధానంగా ఇంజినీరింగ్, పరీక్షల విభాగంలోని కొన్ని సెక్షన్లలో, డీడీఈ విభాగంలో సుమారు 25ఏళ్ల నుంచి 30ఏళ్లవరకు ఒకే విభాగంలో పాతుకుపోయి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి జోలికి వెళ్లకపోవడం గమనార్హం! అధికారులు తమ అనుచరవర్గంగా గుర్తింపు పొందిన వారికే ప్రాధాన్యతనివ్వడం వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది.

కుట్రపూరిత బదిలీలపై ఫిర్యాదు

ఎస్వీయూ అధికారులు ఏకపక్షంగా చేసిన బదిలీల ప్రక్రియ వివాదాస్పదం కావడంతో ఆగ్రహించిన కూటమిలోని మరో పార్టీకి చెందిన ఎస్వీయూ ఉద్యోగులు రాత్రికి రాత్రే పూర్తి వివరాలతో స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. వర్సిటీ అధికారుల పక్షపాత వైఖరిని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఇలాంటి నిర్ణయాలు గతంలో ఎన్నడూ చూడలేదని వర్సిటీ ఉద్యోగులను మానసిక్షోభకు గురిచేసేందుకు అధికారులు ఇలా చేస్తున్నారని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పఠనాసక్తి పెంపుతో సమాజం వైపు..



పలువురు రచయితల కవితా సంపుటిలను ఆవిష్కరిస్తున్న అతిథులు

- 'అరసం' జాతీయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

తిరుపతి కల్చరల్: విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించి సమాజం వైపు వారి దృష్టి మళ్లించాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా ఈ తరం కోసం కథా స్రవంతి, కవితా స్రవంతి పేరిట పలువురు ప్రముఖుల కథలు, కవితలను అరసం సంపుటాల రూపంలో ముద్రించే ప్రయత్నానికి పూనుకుందని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రచురించిన 4 కవితా సంపుటిల ఆవిష్కరణ సభ ఆదివారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతక నరేంద్ర, సాహితీ విమర్శకులు మేడిపల్లి రవికుమార్, అరసం రాష్ట్ర నేత సాకం నాగరాజులతో కలిసి వీటిని ఆవిష్కరించారు. సోమసుందర్ కవిత్వాన్ని పెనుగొండ లక్ష్మీనారాయణ, నాగభైరవ కోటేశ్వరరావు కవిత్వాన్ని మధురాంతకం నరేంద్ర, ఆలూరి బైరాగి కవిత్వాన్ని మేడిపల్లి రవికుమార్, గరిమెళ్ల సత్యనారాయణ కవిత్వాన్ని సాకం నాగరాజు విశ్లేషించారు.మరో అతిథి అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ, విలువలు విలుప్తమైపోతున్న ఇప్పటి పరిస్థితుల్లో సాంస్కృతిక పునర్వికాసం కోసం అరసం విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం ఆత్మీయ అతిథి రచయిత మూరిశెట్టి గోవింద్ మాట్లాడారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, పల్లిపట్టు నాగరాజు, పేరూరు బాలసుబ్రమణ్యం, మన్నవ గంగాధర ప్రసాద్, కాంతారావు, తోట వెంకటేశ్వర్లు, మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ, గొడుగుచింత గోవిందయ్య, టెంకాలయ దామోదరం, మేఘనాథ్‌రెడ్డి, ఏడుకొండలు, మల్లేశ్వరరావు, అంకమనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న బండి కుంభాలు



గ్రామాలలో బండి కుంభాలు తీసుకువెళ్తున్న భీమసేన పాత్రధారి బాలచంద్ర

రామచంద్రాపురం: మండలంలో ఎన్ఆర్ కమ్మపల్లె సమీపంలోని శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం చిట్టత్తూరులో బండి కుంభాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భీముని వేషధారి బాలచంద్ర గ్రామాల్లోకి వెళ్లి అన్న ప్రసాదాన్ని సేకరించి, ఆలయానికి తీసుకువచ్చి, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు వితరణ చేశారు. అనంతరం ఆలయంలోని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మీ కోసం-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్.మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై అర్జీలు ఇచ్చేవాళ్లు ఆధార్ కార్డు జెరాక్స్, ఫోన్ నంబర్ ఇవ్వాలన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు అమానుషం



భాకరాపేటలో జరిగిన ప్రదర్శనలో మాట్లాడుతున్న పురుషోత్తంనాయుడు

భాకరాపేట : బంగ్లాదేశ్ హిందువులపై దాడులు చేయడం అమానుషమని చంద్రగిరి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పురుషోత్తంనాయుడు నిరసించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు స్వస్తి పలకాలంటూ ఆదివారం మధ్యాహ్నం చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట బస్టాండ్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి బంగ్లా హిందువులకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎర్రావారిపాళెం ఎస్ఐగా ఎర్రిస్వామి



భాకరాపేట : ఎర్రావారిపాళెం ఎస్ఐగా ఎర్రిస్వామి ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆదోని నుంచి ఆయన బదిలీపై ఎర్రావారిపాళెంకు వచ్చారు. శాంతి భద్రతలను పరిరక్షించడమే ప్రధాన కర్తవ్యంగా పనిచేస్తానన్నారు.

ఇద్దరికి డాక్టరేట్



షేక్ ఆశా బేగం



నవీన్‌తాజ్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగంలో ఇద్దరికి డాక్టరేట్ ప్రకటించారు. ప్రొఫెసర్ ఎస్ జ్యోత్స్నరాణి పర్యవేక్షణలో 'ఎఫెక్ట్ ఆఫ్ అవేర్‌నెస్ సెషన్ ఆన్ క్యాప్ అమాంగ్ ఉమెన్ అండ్ ద డెవలప్‌మెంట్ ఆఫ్ మొబైల్ అప్లికేషన్ ఫర్ ఎర్లీ డిటెక్షన్ ఆఫ్ బ్రెస్ట్ క్యాన్సర్' అనే అంశంపై షేక్ ఆశా బేగం, అదే విభాగానికి చెందిన మరో పరిశోధక విద్యార్థిని ఎస్ నవీన్‌తాజ్ ప్రొఫెసర్ వై.ఇందిరా ముజీబ్ పర్యవేక్షణలో 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్ లోడెడ్ ఫార్మకోసోమ్స్ అండ్ ఇన్వాసోమ్స్ యాజ్ వేసిక్యూలర్ క్యారియర్స్ ఫర్ ఎన్హానింగ్ ట్రాన్స్‌డెర్మల్ ఫర్మీయేషన్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ సాధించారు.

గుజిరి వ్యాపారుల సమస్యలు పరిష్కరించరూ!



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్: నగర పాలక శుభ్రతలో గుజిరి వ్యాపారులు కీలకపాత్ర పోషిస్తున్నా వారి సమస్యలు పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇకనైనా వారి సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, నగర కార్యదర్శి ఎన్‌డీ.రవి డిమాండ్ చేశారు. ఆదివారం గంధమనేని శివయ్య భవన్‌లో గుజిరి వ్యాపార సంఘం నేతల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, గుజిరి వ్యాపారుల లైసెన్సులు రెన్యువల్ చేయాలని, ఈ వ్యాపారాన్నే నమ్ముకుని వేలాది కార్మికులు జీవిస్తున్నారన్నారు. వారి సమస్యలను పరిష్కరించని పక్షంలో వారి పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గుజిరి వ్యాపారుల సంఘ నేతలు అల్లాబక్షు, దాము, రాధ, అజీమ్, శ్రీరాములు, రాము పాల్గొన్నారు.

కోల్‌కతా ఉదంతంపై కొవ్వొత్తులతో నిరసన



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న సీఎస్ఐ చర్చి మహిళలు

పాకాల: కోల్‌కతాలో పీజీ డాక్టర్‌పై లైంగికదాడి, దారుణ హత్యను నిరసిస్తూ ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చి మహిళలు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. తొలుత చర్చి ఆరాధన కార్యక్రమంలో వైద్యురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి నివాళులు అర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కోల్‌కతా ఉదంతం యావత్ దేశాన్ని కుదిపేస్తోందని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలకు పనిచేసే చోటే..అదీనూ సమాజంలో ఎంతో గౌరవప్రదమైన వైద్యులకే రక్షణ కల్పించలేని వ్యవస్థల డొల్లతనం మరోసారి బట్టబయలైందన్నారు. ఒకప్పుడు నిర్భయ ఉదంతం దేశ ప్రజలను ఎంతగా కదిలించిందో ఇప్పుడు అంతకుమించిన ఆందోళన, నిరసన కోల్‌కతా ఘటనతో వ్యక్తమవుతోందన్నారు. లైంగిక దాడులు, హత్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి మహిళా కార్యదర్శి విమల విక్టోరియా, రాఘవేలు, చర్చి మహిళలు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ 21వ శతాబ్దపు మార్గదర్శకుడు

- మాజీ కేంద్ర మంత్రి మణిశంకర్ అయ్యర్



జూమ్ రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పలువురు ప్రముఖ వక్తలు

తిరుపతి కల్చరల్: భారతదేశానికి 7వ ప్రధానమంత్రిగా సేవలు అందించిన రాజీవ్ గాంధీ 21వ శతాబ్దంలో దేశాభివృద్ధి విషయంలో అగ్రగామిగా వినూత్న సంస్కరణలతో మార్గదర్శకులుగా నిలిచారని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మాజీ మంత్రి మణిశంకర అయ్యర్ కీర్తించారు. రాజీవ్ గాంధీ 80వ జయంతి పురస్కరించుకుని భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ(అగ్రశ్రీ) ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాలం ద్వారా '21వ శతాబ్దపు భారతదేశ రూపకల్పనలో రాజీవ్ గాంధీ దూరదృష్టి, కృషి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మణిశంకర్ అయ్యర్ ప్రసంగించారు. రాజీవ్ గాంధీ కాలం నుంచి ఇప్పటి వరకు పంచాయతీ రాజ్ పరిణామం, అమలులో తాను సన్నిహితంగా మెలిగినందుకు గొప్పగా భావిస్తున్నానన్నారు. అగ్రశ్రీ వ్యవస్థాపక సంచాలకుడు డాక్టర్ డి.సుందరరామ్ సమావేశానికి అనుసంధాన కర్తగా వ్యవహరించగా, ప్యానలిస్టు ప్రొఫెసర్ ఎం.అస్లాం, రిటైర్డ్ ఐఏఎస్ డబ్ల్యూ ఆర్.రెడ్డి, భోపాల్ జాగ్రన్ లేకిసిటీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సందీప్ శాస్త్రి, ప్రొఫెసర్ మదన్ మోహన్ గోయెల్ మాట్లాడారు. రాజీవ్ గాంధీ 21వ శతాబ్దంలో భారతదేశాన్ని మార్చడానికి వివిధ రంగాలలో తీసుకువచ్చిన బహు పరిమాణ సంస్కరణలను గురించి సోదాహరణంగా వివరించారు. మధ్యాహ్నం సమావేశంలో ప్యానలిస్టులు రిటైర్డ్ ఐఏఎస్ జె.మురళి, ఏపీ సీఎం మాజీ ప్రత్యేక కార్యదర్శి వెంకట్రావ్, కర్ణాటక రాష్ట్ర పంచాయతీరాజ్ పరిషత్ వర్కింగ్ చైర్మన్ వై.ఘోర్పడే, ప్రొఫెసర్ ఎం.గోపీనాథ్‌రెడ్డి, ప్రొఫెసర్ కె.గిరీశన్ మాట్లాడారు.ముగింపు సమావేశంలో నాటి ప్రధాని రాజీవ్ గాంధీ ప్రత్యేక కార్యదర్శిగా, భారత ప్రణాళిక సంఘం డెప్యూటీ చైర్మన్‌గా సుమారు పదేళ్లు పనిచేసిన డాక్టర్ మాంటెక్ సింగ్ ఆహ్లువాలియా గౌరవ అతిథిగా మాట్లాడారు. రాజీవ్ గాంధీ హత్యకు గురైన 33 ఏళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవడం చాలా అవసరం అని తెలిపారు.

సాహితీ కళాకారులకు సత్కారం



వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతుల్ని సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: సాహిత్య, సేవా, కళా రంగాలలో సేవలు అందిస్తున్న వారిని ఆదివారం ఘనంగా సత్కరించి అభినందించారు. జీవకోనలోని విశ్వం స్కూల్లో దేశభక్తి, సాంస్కృతిక సంబరాలు మార్పు సేవ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏర్పేడు మండలం బాలాకృష్ణాపురం భజన బృందం, గురవయ్య పండరి భజన బృందం దేశభక్తి పాటలు, పల్లెజన జీవన జానపద గీతాల భజనలతో కళా బృందాల ప్రదర్శన ఆకట్టుకుంది. పలువురిని జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యువ సమాజ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు టి.వెంకటేశ్వర్లు, మార్పు సేవా సంస్థ గురవయ్య, డోలు మాస్టర్ సంజీవయ్య, పలువురు సాహిత్య, సేవా, కళారంగాల కళాకారులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా పొలం స్వాధీనానికి యత్నం

- న్యాయం చేయాలని బాధితుల వినతి



సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు కుమార్తెలు మధురవాణి, రెడ్డెమ్మ

తిరుపతి కల్చరల్: ఎర్రావారిపాళెం మండలం ఎనమలవారిపల్లెకు చెందిన రఘునాథరెడ్డి నుంచి తాము 1988లో 3.76 ఎకరాల భూమి కొనుగోలు చేశామని, ఇప్పుడు అతని కుమారుడు విజయ్‌కుమార్‌రెడ్డి ఆ పొలాన్ని సొంతం చేసుకోవాలని తమపై దౌర్జన్యం చేస్తున్నారని బాధితురాలు సరస్వతమ్మ కుమార్తెలు మధురవాణి, రెడ్డెమ్మ వాపోయారు.. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తరచూ విజయ్‌కుమార్‌రెడ్డి తమపై గొడవలకు దిగుతూ విద్యుత్ పరికరాలను తీసుకెళ్లిపోతున్నారని, వారిని అడ్డుకున్న తమ అమ్మ సరస్వతమ్మను బలంగా తోసివేయడంతో గాయాల పాలై ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని తెలిపారు. అతని దౌర్జన్యంపై పోలీసులను ఆశ్రయించినా స్పందన లేదని, ఉన్నతాధికారులనై స్పందించి దౌర్జన్యకారులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సరస్వతమ్మ అల్లుడు విశ్వనాథ్ పాల్గొన్నారు.


21న కూచిపూడి రంగప్రవేశం..ఆశీర్వదించండి



సమావేశంలో మాట్లాడుతున్న తేజస్విని కొరముట్ల

తిరుపతి కల్చరల్: చిన్నప్పటి నుంచి ఎంతో మక్కువతో కూచిపూడి నృత్యాన్ని నేర్చుకున్న తాను ఈనెల 21న సాయంత్రం మహతి కళాక్షేత్రంలో నృత్య రంగప్రవేశం చేస్తున్నానని, తన ఆశీర్వదించాలని తేజస్విని కొరముట్ల కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. యునైటెడ్ కింగ్‌డమ్(యూకె.)లో ఉంటున్న తాను 9వ ఏట నుంచి కూచిపూడి నాట్యంలో శిక్షణ పొందానని తెలిపారు. అక్కడ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను విదేశీయులు ఎంతో గౌరవిస్తారని, భారతదేశ సంప్రదాయ నృత్యాలంటే వారికి ఇష్టమని చెప్పారు. తన గురువు దీప విశ్వమోహన్ సారథ్యంలో చేసే తాను మహతిలో చేసే ఆరంగేట్రంకు నగర ప్రజలు, కళాభిమానులు హాజరై తిలకించాలని, సాయంత్రం 4 నుంచి రాత్రి 8.30 గంటల వరకు తాను నృత్య ప్రదర్శన ఇవ్వనున్నట్టు తెలిపింది. సమావేశంలో ఆమె తండ్రి ఉదయ్ శంకర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల అత్యవసర చికిత్సపై అవగాహన



అవగాహన కార్యక్రమానికి హాజరైన అతిథులు, వైద్యులు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో రుయా ఆస్పత్రి చిన్నపిల్లల విభాగంలో అత్యవసర సమయంలో అందించాల్సిన చికిత్సపై వైద్య విద్యార్థులకు, వైద్యులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేరళ రాష్ట్రం కొట్టాయంకు చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ బాలచందర్, కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్‌కు చెందిన డాక్టర్ వెంకటాచలపతి, డాక్టర్ ఘనశ్యామ్ చౌదరి (లక్నో), డాక్టర్ కేశవులు (హిందూపూర్) ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. 'రేషనల్ ఇవాల్యుయేషన్ ఆఫ్ క్రిటికల్ ఇన్‌ఫెక్షన్ ఇన్ పీడియాట్రిక్ ఎమర్జెన్సీ, ప్రాజెక్ట్ ఏంజెల్' అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో రుయా చిన్నపిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ మనోహర్, ప్రొఫెసర్ డాక్టర్ కిరీటి, అంజన్‌కుమార్, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్స్ పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

రామచంద్రాపురం: మండలంలోని అనుప్పల్లె ఉన్నత పాఠశాలలో 2002-2003 బ్యాచ్ పదవ తరగతి సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. బెంగళూరు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 20మంది పైచిలుకు పూర్వ విద్యార్థులు జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. తమ ఉన్నతికి బాటలు వేసిన గురువులను ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. స్కూలు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ

నాగలాపురం: గ్రామదేవత చెల్లాతమ్మకు ఆదివారం ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. ఆడినెల చివరి ఆదివారం సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారినికి మహిళలు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకుడు జానకీరామన్, నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ద్రౌపదీ సమేత ధర్మరాజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు, విశేషాలంకరణ, పూజలు చేశారు. అగ్నిగుండ ప్రవేశం చేసే భక్తులు కంకణాలు ధరించారు. కంకణాలు ధరించిన భక్తులు పసుపు దుస్తులు ధరించి, స్నానాలు ఆచరించి గోవిందనామ స్మరణలతో క్యూలో నిలబడ్డారు. పోతురాజుతోపాటు అమ్మవారి ఉత్సవమూర్తిని అగ్నిగుండం వద్దకు తీసుకువచ్చి కొలువుదీర్చారు. అమ్మవారి పైట చెరుగులో నిప్పులు మూటకట్టారు. ముందుగా ఆలయ పూజారి పూల చెండును అగ్నిగుండలో వేసిన అనంతరం గుండంలోకి ప్రవేశించారు. తరువాత భక్తులు గోవిందనామ స్మరణలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.